క్లుప్తంగా

దొడ్లమిట్టలో కార్డెన్ సెర్చ్



గ్రామంలో పర్యటిస్తున్న పోలీసులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట గ్రామంలో ఆదివారం ఉదయం రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర, ఎస్‌ఐ అరుణ్ కుమార్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీలో అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని చివరి రోజు ఆదివారం అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఆయిల్ ఫైర్స్, గ్యాస్ ఫైర్, ఎలక్ట్రికల్ ఫైర్ జరిగే సమయంలో, ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తల గురించి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎఫ్ కల్యాణ చక్రవర్తి, ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం నక్క హరిజనవాడలో ఇటీవల దళితనాయకుడు వలస ఉమాపతి మృతి చెందాడు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాపతి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామి వెంకటేశ్వర్లు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు డాక్టర్ శంకర్, పసల కృష్ణయ్య, నరేంద్ర, షేక్ సిరాజ్‌బాషా, పఠాన్ ఫరీద్, జుంలేషా, అస్లాం, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి, రేణిగుంటలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయంలో సీఎం పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మహిళా సెక్యూరిటీ, స్వీపర్లకు చీరలను పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆయా మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



బీఎన్‌కండ్రిగ: పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 36 చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టరు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు చర్చికి వెళ్లి భక్తిశ్రద్ధలతో బైబిల్‌ను పఠనం చేసి ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు మానవుల పాపాలకై శుక్రవారం నాడు సిలువ వేయబడి ఆదివారం నాడు సమాధిలో నుంచి లేచాడని పాస్టర్లు తెలిపారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని చనిపోయిన వారి సమాధులపై పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లోని ప్రార్థనల్లో భారీసంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొన్నారు.

ఫ్లవర్ శ్రీసిటీ

దక్షిణ భారతదేశంలో దినదినాభివృద్ధి చెందుతున్న పారిశ్రామికవాడ శ్రీసిటీని ప్రకృతి అందాలు ముంచెత్తుతున్నాయి. విశాలమైన ప్రధాన నాలుగు వరుసల రోడ్డు మార్గంలో పెంచుతున్న పూల మొక్కలు రంగురంగుల పూలతో ప్రత్యేక ఆకర్షణగా అటు వాహనదారులను, స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. సుమారు 20 కి.మీల మేరకు పలు పరిశ్రమలకు వెళ్లేందుకు రోడ్లు ఉన్నాయి. ఈ మార్గాల్లో విశాలమైన నాలుగు వరుసల బీటీ రోడ్లు వేశారు. వాటి మధ్యలో చేపట్టిన మొక్కల పెంపకం ఆకట్టుకుంటోంది.

- పారిశ్రామికవాడలో ప్రకృతి అందాలు
- ఆకర్షణీయంగా రోడ్ల మధ్య పూలమొక్కలు
- ఉద్యోగులు, వాహనదారులను ఆకట్టుకుంటున్న పూలు
- కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్న యాజమాన్యం
- సెజ్‌లో ప్రత్యేకంగా నర్సరీ సైతం ఏర్పాటు



శ్రీసిటీ ప్రధాన రోడ్ల మధ్య ఆకర్షణీయంగా తెల్లటి పూలు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని విశాలమైన ప్రధాన రోడ్డు మార్గం మధ్యలో పెంచుతున్న పూల మొక్కల నుంచి వస్తున్న రంగురంగుల పూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మండు వేసవిలో సైతం పూలు మొక్కలు పచ్చగా ఉంటూ అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులను ఆకట్టుకుంటున్నాయి. పలువురు సెల్ఫీలు దిగుతూ ప్రకృతి అందాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.

ఆసక్తిగా పెంపకం..

శ్రీసిటీ ఏర్పాటు నుంచి అటు రోడ్ల వెంబడి, ఇటు ఏర్పాటవుతున్న పరిశ్రమల వద్ద పూల మొక్కలు, పలురకాల పచ్చని చెట్ల పెంపకంపై శ్రీసిటీ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. మొక్కలు నాటి వదిలేయకుండా వాటి సంరక్షణకు శ్రీసిటీ యాజమాన్యం బాధ్యత తీసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

నర్సరీ కూడా ఏర్పాటు..

మరోవైపు శ్రీసిటీ సెజ్‌లో రోజురోజుకు బడా పరిశ్రమలు కొలువుదీరుతున్నాయి. ఇప్పటికే 250కి పైగా పరిశ్రమలకు కేంద్రంగా శ్రీసిటీ అభివృద్ధి చెందుతోంది. అందుకు తగిన విధంగా పర్యావరణాన్ని అందించేందుకు యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో కోటి మొక్కలు నాటే దిశగా శ్రీసిటీ పరిధిలో నర్సరీని సైతం ఏర్పాటు చేసి చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు.



శ్రీసిటీ ప్రధాన రోడ్డు మార్గంలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న ఎర్రటి పూలు



పింక్ కలర్ పూల మొక్కలు

పలువురికి పరామర్శ



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదివారం పలువురిని పరామర్శించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ భక్తవత్సలనాయుడు ఇటీవల ఆపరేషన్ చేసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను మాజీ ఎమ్మెల్యే కలిసి పరామర్శించారు. ఇక పల్లం గ్రామానికి చెందిన తాటిపత్తి ప్రభాకర్‌రెడ్డి తల్లి రామమ్మ ఇటీవల మరణించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. ఇక పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యుడు హరినాథ్‌బాబు భార్య ప్రేమకుమారి ఇటీవల మరణించారు. కర్మక్రియలు సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలకృష్ణమూర్తి, సాధన మున్నారాయల్, సురేష్, సురేంద్ర, చిందేపల్లి మధు, ధనలక్ష్మి, చంద్రారెడ్డి, జీవీకే రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, సూర్యారెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.



భక్తవత్సలనాయుడును పరామర్శిస్తున్న బియ్యపు

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయుడు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజులమండ్యంలోని శ్రీ సాయిగణేష్ విద్యాలయంలో కరస్పాండెంట్లు జువ్వల ధనంజయ రెడ్డి, చెంచు రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఫస్ట్ క్లాస్ నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు సుమారు 700 నమూనాలను సిద్ధం చేసి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ప్రతి ఒక్క విద్యార్థి వారి చేసిన నమూనాల విశిష్టతను వివరించారు. ఎగ్జిబిషన్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సందర్శించి విద్యార్థుల ప్రతిభను చూసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా మహాకుంభాభిషేకం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ముందుగా గంగమ్మ అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో కలశారాధన చేపట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, కుంభస్థాపన, అన్నదాన కార్యక్రమాలను కార్యనిర్వాహకులు శంకరయ్య, గురవయ్య నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు మణినాయుడు, నాయకులు ఆరణి సుధాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గంగమ్మను దర్శించుకుంటున్న మణినాయుడు, సుధాకర్‌రెడ్డి

23న మండలమీట్

వరదయ్యపాళెం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23న ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో జరగనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

నాగలాపురం: మండలంలోని వడ్లకుప్పం గ్రామంలో పుత్తుక్కల్ శ్రీ ముత్తుమారియమ్మన్ అనే 52 అడుగుల విశ్వరూప శ్రీ నాగేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం అగ్నిగుండ ప్రవేశం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ముత్తుమారియమ్మను పల్లకిపై అధిష్టించి పురవీధుల్లో ఊరేగించి అగ్నిగుండం వద్దకు తీసుకొచ్చారు. బాణసంచా, ప్రత్యేక పూజలు అనంతరం 200 మందికి పైగా భక్తులు భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశంలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు సత్యవేడు సీఐ మురళి నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

వినాయకుడి ఆలయంలో మహా కుంభాభిషేకం



అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలంలోని వెంకటరామాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు హోమాలు చేశారు. వినాయక స్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు పూర్తి చేయగా గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గోపురాల ముంగిట చెప్పులు



శ్రీకాళహస్తి ఆలయ గోపురాల వద్ద ఇబ్బడి ముబ్బడిగా వదిలేసిన చెప్పులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోకి నాలుగు గోపురాల నుంచి భక్తులు ప్రవేశిస్తుంటారు. సరైన అవగాహన లేకపోవడం, చెప్పేవారు లేకపోవడంతో భక్తులు తమ చెప్పులను నాలుగు గోపురాల ప్రవేశ ద్వారాల ముందు ఎక్కడ పడితే అక్కడ ఇబ్బడిముబ్బడిగా వదిలేస్తున్నారు. ఆ గోపురాల వద్ద పని చేసే సిబ్బంది, సెక్యూరిటీ భక్తులకు కనీసం చెప్పుల స్టాండ్ ఎక్కడ ఉందో చెప్పే ప్రయత్నం కూడా చేయడం లేదు. మొబైల్, బ్యాగులు స్టాండ్‌లో పెట్టించుకునే చొరవ చెప్పులు పెట్టించుకునేందుకు చూపకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఎక్కడా చెప్పులు పెట్టుకునే సూచికబోర్డులు లేకపోవడం.. అవసరమైన స్టాండ్లు లేకపోవడం వల్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ అధికారులు నాలుగు గోపురాల ప్రవేశ ద్వారాల వద్ద ఉచిత చెప్పుల స్టాండ్ కోసం కొన్ని ర్యాక్‌లను ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

సంత.. వసూళ్ల దందా..

చిరు వ్యాపారస్తులు రేణిగుంట సంతలో వ్యాపారాల కోసం వస్తారు. అలాంటి చిరు వ్యాపారస్తులపై అధికార పార్టీకి చెందిన గుత్తేదారుడు అనధికారికంగా గేటు వసూళ్లు చేస్తూ యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నాడు. అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల వారి ఆగడాలకు అంతే లేకుండాపోయింది. వారు చెప్పిందే రేటు అన్నట్టు వ్యవహరిస్తున్నారు.

- రేణిగుంట సంతలో ఇష్టానుసారంగా గేటు వసూళ్లు
- అడిగినంతా ఇవ్వాలని వ్యాపారులకు హుకుం
- ప్రశ్నిస్తే సంతలో చోటివ్వమని బెదిరింపులు
- ఎక్కడా కనిపించని ధరల పట్టిక
- పేట్రేగుతున్న గుత్తేదారుడు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



గత శనివారం సంతలో గేటు వసూలు చేస్తున్న గుత్తేదారుడి మనుషులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన రేణిగుంట వారపు సంతకు తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి చిరు వ్యాపారులు వచ్చి వ్యాపారం చేసుకుంటారు. అయితే ఈ సంతలో తెలుగు తమ్ముళ్లు దందాకు దిగారు. పంచాయతీ వేలంపాటలో సంవత్సరకాలం పాటు గేటు వసూళ్లను సొంతం చేసుకున్న టీడీపీకి చెందిన ఓ నాయకుడు అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారు. రూ.50 ఇచ్చే చోట రూ.100, రూ.100 ఇవ్వాల్సిన చోట రూ.300, రూ.300 ఇవ్వాల్సిన చోట రూ.600 అనధికారికంగా గేటు వసూళ్లు చేస్తూ చిరు వ్యాపారస్తులను వేధిస్తున్నారు. ఎందుకు ఇవ్వాలి అని ఎదురు తిరిగిన వ్యాపారస్తులను సంతలో వ్యాపారం చేసుకునేందుకు స్థలాన్ని ఇవ్వం మీకు దిక్కున చోట చెప్పుకోండి అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అసలే విపరీతమైన ఎండల వల్ల వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారస్తులు అధిక గేటు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బయటకు చెప్పుకునేందుకు కూడా వ్యాపారస్తులు భయపడుతున్నారంటే తెలుగు తమ్ముళ్లు ఎంత భయపెడుతున్నారో తెలుస్తోంది. పేరు చెప్పుకోలేని ఎండు చేపలు వ్యాపారం చేసుకునే మహిళ ఆవేదన వెళ్లగక్కింది. గతంలో 200 ఇచ్చేవాళ్లమని, పంచాయతీ సిబ్బంది రూ.100 వసూలు చేసేవారని.. కానీ ప్రస్తుతం రూ.300 ఇవ్వమంటూ గుత్తేదారుడు హుకుం జారీ చేశాడని వాపోయింది. తెల్లారి నుంచి కూర్చుంటే కనీసం కేజీ చేపలు కూడా అమ్ముడు పోలేదని వారికి రూ.300 ఏ విధంగా కట్టాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. పంచాయతీ అధికారులకు ఈ విషయం తెలిసినా..ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. కనీస పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ విధంగా అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. ప్రతి వ్యాపారస్తుడికి ఇచ్చిన రుసుముకు తగిన రసీదు ఇవ్వాలని నిబంధనలు ఉన్నా.. సగం మందికి కూడా రసీదులు ఇవ్వడం లేదనే మాటలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు పాతరేసి..

వేలంపాటలో పంచాయతీ నిబంధనలకు కట్టుబడి గేటు వసూళ్లు చేసుకుంటామని ఒప్పందపత్రం కుదుర్చుకుని టెండర్ దక్కించుకున్న గుత్తేదారుడు నిబంధనలకు పాతరేసి ఇష్టానుసారం వసూళ్లు చేస్తున్నాడు.

కానరాని ధరల పట్టిక..

సంత ఆవరణలో ఏ వ్యాపారస్తుడు ఎంత మొత్తం చెల్లించాలి ? ఏ వాహనం ఎంత చెల్లించాలి ? అనేది వేలంపాట నిర్వహించే ముందే పంచాయతీ అధికారులు ధరల పట్టికను సిద్ధం చేశారు. ఆ ధరల పట్టికకు లోబడే రుసుం వసూళ్లు చేయాలి. కానీ ధరల పట్టిక సంత ఆవరణలో ఎక్కడా కనిపించకపోవడం శోచనీయం. పంచాయతీ అధికారులు మాత్రం తాము సంత ఆవరణలో ధరల పట్టిక పెట్టామని చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

సంతలో అధిక వసూళ్లు చేస్తున్నారని తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. సంతకు వెళ్లి పరిశీలించి అధిక వసూళ్లు చేస్తున్నారని నిర్ధారణ అయితే కచ్చితంగా గుత్తేదారుడిపై చర్యలు తీసుకుంటాం.

– మణి, ఈఓ రేణిగుంట



రేణిగుంట వారపు సంత

కల్కి భగవాన్ అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

సూళ్లూరుపేట : కల్కి భగవాన్ పేరుతో విజయ్‌కుమార్ అనే వ్యక్తి ప్రజలను, ప్రభుత్వాలను మభ్యపెట్టి 20 ఏళ్ల క్రితం వరదయ్యపాళెంలోని దళితుల అసైన్డ్ భూములను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయాలని భారత హేతవాద సంఘం అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం సూళ్లూరుపేట సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విజయ్‌కుమార్ అసైన్డ్ భూములను ఆక్రమించుకుని రూ.500 కోట్లతో ఆశ్రమాన్ని నిర్మించారని తెలిపారు. భూముల ఆక్రమణ విషయంలో కల్కి ట్రస్టు వేసిన కేసులను హైకోర్టు 2024 జనవరి 10న కొట్టివేసిందని తెలిపారు. అధికారులు దళితులకు భూములు ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కళ్లివెట్టు గ్రామం దగ్గర సర్వే నంబర్ 295లోని 21 ఎకరాల అటవీ భూములను ఆక్రమించుకుని పెద్ద పెద్ద భవనాలు నిర్మించినా ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వరదయ్యపాళెం మండలం బత్తులవల్లం వద్ద, బీఎన్‌కండ్రిగ మండలం కళ్లివెట్టు వద్ద నిర్మించిన భవనాలకు అనుమతులు లేవని తెలిపారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను అడిగితే అటవీశాఖవారు చర్యలు తీసుకోవాలని అంటున్నారని, అటవీశాఖ వారిని అడిగితే రెవెన్యూ అధికారులపై నెట్టేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.